

రెండు నెలల క్రితమే స్కెచ్

రాజలింగమూర్తి హత్యకు రెండు నెలల క్రితమే నిందితులు స్కెచ్ వేశారని భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. - 8లో▸



'అకుట్' ఎన్నికలకు నోటిఫికేషన్

కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) ఎన్నికలకు యూనివర్సిటీ అధికారులు ఇటీవల నోటిఫికేషన్ జారీచేశారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $34^0/19^0$

జిల్లాలో ఉదయం నుంచి సాధారణ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండలు ఎక్కువ ఉంటాయి. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

వరంగల్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పరిపాలనాపరమైన కారణాల వల్ల ప్రజావాణిని రద్దు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి వినతులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని కలెక్టర్ కోరారు.

మార్చి 4 నుంచి కేయూ ఎంబీఏ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ మొదటి సెమిస్టర్ పరీక్షలు మార్చి 4 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసిం ఇక్బాల్ తెలిపారు. మార్చి 4, 6,11, 13, 17, 19, 21 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని, మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో చూడవచ్చునని సూచించారు.

కళాకారులను ప్రోత్సహించాలి

- సినీనటుడు సుబ్బరాయశర్మ



హన్మకొండ కల్చరల్: నాటక కళాకారులను ప్రోత్సహించాలని ప్రముఖ సినీ, బుల్లితెర నటుడు సుబ్బ రాయశర్మ అన్నారు. వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ప్రారంభమయ్యాయి. సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజా మనోహర బాబు నేతృత్వంలోజరిగిన ఈ పోటీలను సుబ్బరాయశర్మ ప్రారంభించి మాట్లాడారు. నాటక ప్రదర్శనలో భాగంగా బీఎం.రెడ్డి దర్శకత్వం వహించిన హైదరాబాద్‌కు చెందిన విశ్వ శాంతి కల్చ రల్ అసోసియేషన్ 'స్వేచ్ఛ', ఉప్పులూరు సుబ్బ రాయశర్మ దర్శకత్వంలో హైదరాబాద్‌కు చెందిన మహతి క్రియేషన్స్ 'ఉక్కు సంకెళ్లు' అలరించాయి. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు కుందావజ్జుల కృష్ణమూర్తి, వనం లక్ష్మీకాంతారావు, ప్రాయోజకులు పాలాయి శరత్, కల్యాణ్, సంతోష్‌కుమార్‌తో పాటు భాస్కర్‌రావు, ఎన్వీఎస్.చారి పాల్గొన్నారు.

పంట పొలాల్లో ఫ్లెక్సీ



వర్ధన్నపేట: కొలతల ప్రకారమే పంట పొలాల్లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. అంతకు మించి ఎక్కువగా రోడ్డు విస్తరణ పనులు చేపడితే నష్టపోతామని పేర్కొన్నారు. భూమి కోల్పోకుండా పోరాటం చేస్తామనిహెచ్చరికతో కూడిన ఫ్లెక్సీని ఆదివారం పంట పొలాల వద్ద ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఇల్లంద గ్రామం నుంచి పర్వతగిరి మండల కేంద్రానికి బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణకు ఎక్కువ భూమి తీసుకుంటున్నాడని రైతులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా వారు పంట పొలాల వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

బీసీ అభ్యర్థులకు ఓటు వేయండి

నయీంనగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో అగ్రకులాల నోట్లను తిరస్కరించి.. బీసీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ కోరారు. ఆదివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో వివిధ బీసీ కుల సంఘాల నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌రాజ్‌యాదవ్, డాక్టర్ వెంకటస్వామిని భారీ మెజార్టీతో గెలిపించడం ద్వారా రాష్ట్రంలో బీసీల శకం ప్రారంభమవుతుందని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 26వేల ఓట్లు ఉంటే అందులో కేవలం 2వేల ఓట్లు మాత్రమే ఆధిపత్య వర్గాల వారివి ఉన్నాయని, మిగతా ఓట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలవని, మన ఓట్లు మనం వేసుకుంటే విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తాళ్ల సంపత్‌కుమార్, సాయిని నరేందర్, కందికొండ వేణుగోపాల్, బోనగాని యాదగిరి గౌడ్, ఎదునూరి రాజమౌళి, పల్లెబోయిన అశోక్, చందా మల్లయ్య, జనగాని శ్రీనివాస్ గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం

- ప్రభుత్వ పాఠశాలలకు రూ.57.35 లక్షల నిధులు
- పరికరాలు కొనుగోలు చేసిన హెచ్‌ఎంలు, పీఈటీలు
- విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు



అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

ఖానాపురం: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు మంజూరు చేసింది. వీటితో ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాపరికరాలు కొనుగోలు చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

క్రీడానిధి కింద నిధులు మంజూరు..

జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లు మొత్తం 556 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు, నిధులు లేక విద్యార్థులు క్రీడలకు దూరమయ్యే పరిస్థితి ఉండేది. వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో కొంతమంది విద్యార్థులు క్రీడల్లో రాణించేవారు. ఈక్రమంలో విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా క్రీడా సామగ్రి కొనుగోలు చేసేందుకు నిధులు విడుదల చేసింది. 2024–25 విద్యాసంవత్సరానికి క్రీడానిధి కింద రూ.57.35 లక్షల నిధులు కేటాయించింది. ఈ నిధులతో పలు రకాల క్రీడాసామగ్రి కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి మంచి అవకాశం లభిస్తుంది. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీస్తే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తారు. పాఠశాలస్థాయి నుంచే వారిని తీర్చిదిద్దే అవకాశం వ్యాయామ ఉపాధ్యాయులకు లభించనుంది.

క్రీడా సామగ్రి కొనుగోలుకు మార్గదర్శకాలు

- పాఠశాలల్లో క్రీడా సామగ్రి కొనుగోలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రాథమిక పాఠశాలల్లో రెండు క్రికెట్ బ్యాట్లు, చిన్న సాఫ్ట్‌బాల్, నాలుగు టెన్నిస్ బంతులు, రెండు ఫుట్‌బాల్స్, ఒక బాస్కెట్ బాల్, ఆర స్కిప్పింగ్ రోప్స్, టెన్నికాయిట్ రింగ్, ఐరన్ బాక్స్ కొనుగోలు చేయాలని సూచించింది.
- ప్రాథమికోన్నత పాఠశాలల్లో షాట్‌పుట్, డిస్కస్ త్రో, స్కిప్పింగ్ రోప్స్ రెండు, ఒక క్రికెట్ బ్యాట్, రెండు టెన్నిస్ బంతులు, వాలీబాల్ కిట్, హ్యాండ్‌బాల్, ఐరన్ బాక్స్‌ను హెచ్‌ఎంలు కొనుగోలు చేస్తున్నారు.
- ఉన్నత పాఠశాలల్లో ఆరు స్కిప్పింగ్ రోప్స్, నాలుగు షాట్‌పుట్, నాలుగు డిస్కస్ త్రో పరికరాలు, 20 బ్యాడ్మింటన్ బ్యాట్లు, నాలుగు క్రికెట్ బ్యాట్లు, 20 టెన్నిస్ బంతులు, రెండు త్రో బాల్స్, వాలీబాల్ నెట్, రెండు వాలీబాల్ బంతులు, రెండు ఫుట్‌బాల్స్, రెండు ఐరన్ బాక్సులు కొనుగోలు చేయాలని సూచించింది.

మైదానాలు లేక ఇబ్బందులు..

ప్రభుత్వ పాఠశాలల్లో మైదానాలు లేక క్రీడాకారులు కొంతవరకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు సైతం ఉన్నాయి. విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తున్నా జిల్లాలో అనేక పాఠశాలల్లో మైదానాలు లేని దుస్థితి ఉంది. పూర్తిస్థాయిలో పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు క్రీడల్లో రాణించలేకపోతున్నారు. పాఠశాలలకు క్రీడామైదానాలు కేటాయించే విధంగా ప్రభుత్వం కృషిచేస్తే విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించడానికి అవకాశం ఉంది.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వివరాలు..

విద్యార్థులు	మంజూరైన నిధులు
1–30	రూ.10 వేలు
31–100	రూ.25 వేలు
101–250	రూ.50 వేలు
251–1000	రూ.75 వేలు
వెయ్యి మందికిపైగా	రూ.లక్ష

క్రీడా సామగ్రి కొనుగోలు చేశాం..



ప్రభుత్వం క్రీడాసామగ్రికి నిధులు కేటాయించింది. మంజూరైన నిధులతో ఇప్పటికే పది రకాల సామగ్రి కొనుగోలు చేశాం. క్రీడా సామగ్రిని విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నాం. క్రీడల్లో రాణించేందుకు వారిని ప్రోత్సహిస్తున్నాం. విద్యార్థులు సద్వినియోగం చేసుకునే విధంగా క్రీడలపై అవగాహన కల్పిస్తున్నాం.

- ఆరిఫ్‌హుస్సేన్, హెచ్‌ఎం బుధరావుపేట

నిధులు మంజూరయ్యాయి..



క్రీడా సామగ్రి కొనుగోలుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలల హెచ్‌ఎంలు క్రీడా సామగ్రి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. క్రీడాపరికరాలు కొనుగోలు చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని వారికి సూచించాం. విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి నిధులు ఉపయోగపడుతాయి.

- శ్రీదేవి, ఎంఈఓ, ఖానాపురం

నీళ్లు లేవనడం కాంగ్రెస్ చేతగాని తనం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి బండి సంజయ్‌కుమార్

ఖిలా వరంగల్: రెండు పంటలకు నీళ్లు ఇవ్వాల్సింది పోయి 'వరి సాగు చేయొద్దు.. నీళ్లు లేవని చెప్పడం' కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన వరంగల్ బొల్లికుంట ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యాన ఉపాధ్యాయ ఓటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కృష్ణానదిలో పుష్కలంగా నీళ్లుంటే అప్పనంగా నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డి ఏపీకి దోచిపెడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును 50 శాతం కేసీఆర్ నాశనం చేస్తే.. మిగిలిన 50 శాతం కాంగ్రెస్ నాశనం చేస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికే నీళ్లు లేక 7 లక్షల ఎకరాల్లో వేసిన వరి పంట ఎండిపోయిందని, యూరియా పుష్కలంగా ఉన్నా పంపిణీ చేసేందుకు ఈ ప్రభుత్వానికి చేత కావడం లేదని ధ్వజమెత్తారు. ఫీజురీయింబర్స్‌మెంట్ అందక చిన్న చిన్న కాలేజీలు అడుక్కునే పరిస్థితి ఉందని, అప్పులు చేసి విద్యా సంస్థలు నడిపించే దుస్థితి వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగనే గాలికొదిలేస్తున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ 14 నెలల పాలనలో ఆసరా, రైతు భరోసా, రుణమాఫీ అరకొరగానే ఇచ్చారు.. నేటికీ 2లక్షల ఉద్యోగాల భర్తీ లేదు.. టీచర్ల సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయి.. విద్యావ్యవస్థ అస్తవ్యస్తమైందని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వలేక కేసీఆర్ 61 ఏళ్లకు ఉద్యోగ విరమణ పెడితే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 65 ఏళ్లకు పెంచే యోచనలో ఉందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని తెలిసి సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రచారం చేస్తున్నారని, రాహుల్ గాంధీ వచ్చి ప్రచారం చేసినా గెలిచే పరిస్థితి లేదని చెప్పారు. ఉపాధ్యాయులు చైతన్యవంతులై బీజేపీ బలపర్చిన అభ్యర్థి సరోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రావు పద్మ, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారావు, కొండేటి, నాయకులు శ్రీధర్, సత్యపాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, కీర్తిరెడ్డి, విజయ్‌చందర్‌రెడ్డి, కాశీప్రసాద్, మల్లాడి తిరుపతిరెడ్డి, బన్న ప్రభాకర్ పాల్గొన్నారు.

దైవభక్తి కలిగి ఉండాలి



కొమురవెల్లి మల్లికార్జున స్వామికి మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండ: ప్రతిఒక్కరూ దైవ భక్తి కలిగి ఉండాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. చంద్రుగొండ క్రాస్‌రోడ్డు (పనికర గుట్ట) లోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం, రేణుకాఎల్లమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆలయాలు అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. భక్తులకు వసతులు కల్పించిన ఆలయ నిర్వాహకులకు ఎమ్మెల్యే అభినందించారు. టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానందం, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, నర్సంపేట కోర్టు ఏపీజీ బండి శివకుమార్, ఆలయ పూజారి చెవ్వ భిక్షపతి, నాయకులు కుసుమ చెన్నకేశవులు, రావుల మహిపాల్‌రెడ్డి, తమ్మిశెట్టి సాంబయ్య, వడ్డె సురేశ్, బక్కి కుమారస్వామి, బత్తిని శ్రీధర్, నల్లపు రాజేందర్, భక్తులు పాల్గొన్నారు.

ఓటీపీ వద్దు.. వేలి ముద్రే ముద్దు

- పత్తి కొనుగోళ్లలో బయోమెట్రిక్ అమలు
- సాంకేతిక లోపంతో ఐరిస్‌తో గుర్తింపు
- దళారులకు చెక్ పెట్టిన సీసీఐ, మార్కెటింగ్‌శాఖ
- నేడు రాష్ట్ర కార్యాలయంలో టీఆర్‌ల అప్పగింత



సీసీఐ కేంద్రం వద్ద పత్తి రైతులు

వరంగల్: సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో జారీ చేసిన టీఆర్(టెంపరరీ రిజిస్ట్రేషన్)లలో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ ప్రస్తుతం అమలవుతున్న ఓటీపీ పద్ధతికి స్వస్తి పలికి వేలి ముద్రల(బయోమెట్రిక్) సేకరణ ప్రక్రియను అమలు చేస్తోంది. ఈనెల మొదటి వారంలో సాంకేతికపరమైన లోపాల కారణంగా సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఈక్రమంలోనే టీఆర్‌ల విషయం వెలుగు చూడడంతో బయోమెట్రిక్ పద్ధతిని అమలు చేస్తూ ఈనెల 21 నుంచి పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. వేలి ముద్ర గుర్తింపు కాని సమయంలో ఐరిస్ గుర్తింపు తీసుకుంటున్నారు. దీంతో రైతులు పత్తి విక్రయించేందుకు సీసీఐ కేంద్రాలకు తప్పనిసరి రావాల్సి వస్తోంది.

దళారులకు చెక్..

బయోమెట్రిక్ విధానంతో దళారులకు చెక్ పెట్టినట్లు అధికారులు భావిస్తున్నప్పటికీ రైతుల వద్ద భూములు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. గతంలో కౌలు రైతులు పత్తి విక్రయించేందుకు వ్యవసాయ శాఖ ధ్రువీకరించిన టీఆర్ తీసుకువస్తే మార్కెటింగ్ శాఖలో రిజిస్టరైన రైతుకు ఓటీపీ వెళ్లేది. సదరు రైతు ఓటీపీని ఓకే చేస్తే సీసీఐ ఆరైతు తెచ్చిన పత్తి కొనుగోలు చేసేది. ప్రస్తుతం టీఆర్‌లను పరిగణనలోకి తీసుకోకపోవడంతో సీసీఐ విక్రయ కేంద్రానికి తప్పనిసరిగా రైతులు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేడు టీఆర్‌ల అప్పగింత..!

రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో జారీ చేసిన 46 వేల టీఆర్(టెంపరరి రిజిస్ట్రేషన్)లను సోమవారం (నేడు) రాష్ట్ర మార్కెటింగ్ కార్యాలయంలో అప్పగిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. టీఆర్‌లలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. ఈవ్యవహారంలో సంబంధం ఉన్న డీఈఓ(డాటా ఎంట్రీ ఆపరేటర్)లపై వేటు పడే అవకాశాలున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో వరంగల్ మార్కెట్ కమిటీ పరిధిలో ఇద్దరు ముగ్గురిపై వేటు పడుతుందని తెలిసింది.

కౌలు రైతులకు ఇబ్బందులు..

పత్తి కొనుగోళ్ల కోసం జారీ చేసిన టీఆర్‌లను సాకుగా చూపి అధికారులను సస్పెండ్ చేయడం సరికాదన్న అభిప్రాయాలను రాష్ట్ర కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు. అయితే సీసీఐ కొనుగోలు చేసిన పత్తి డబ్బులు రైతుల ఖాతాల్లోనే పడ్డాయని, వాటిని సొంతానికి వాడుకోవడంతో కొంత మంది కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. దేశ వ్యాప్తంగా సీసీఐ 80 లక్షల బేళ్ల పత్తి కొనుగోళ్లు చేయగా.. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 40 లక్షల బేళ్ల పత్తి సేకరించినట్లు చెబుతున్నారు. సస్పెన్షన్ విషయమై ప్రభుత్వం పునరాలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అలరించిన నాటికల ప్రదర్శన

వర్ధన్నపేట: వర్ధన్నపేటలోని భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు రెండో రోజు ఆదివారం ప్రేక్షకులను అలరించాయి. రాత్రి 9 గంటలకు హైదరాబాద్ వారి 'వీడేం మగాడండీ బాబు' హాస్య నాటిక ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. నటులు తమ హాస్యంతో నాటికను రక్తి కట్టించారు.

చిలుకలూరిపేట వారి 'వర్క్ ఫ్రమ్ హోమ్'

ది అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ చిలుకలూరిపేట వారి 'వర్క్ ఫ్రమ్ హోమ్' నాటికను రాత్రి 10 గంటలకు ప్రదర్శించారు. 'ప్రతిమనిషిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని నాటికలోని సారాంశం. నచ్చిన పనిలో మమేకమైనప్పుడు అది మొగ్గ తొడిగి వెల్లివిరుస్తుంది. ఆ ప్రతిభే మరోసారి చిక్కుల్లోకి నెట్టి పరీక్షిస్తుంది. ఆ చిక్కులను అధిగమించి అప్రతిహతంగా దూసుకుపోయేవాడే విశ్వాన్ని సైతం ఒడిసిపట్టగలడు. అనుకున్నది సాధించగలడు' అనే ఇతివృత్తంతో నాటికను ప్రదర్శించారు.



'వీడేం మగాడండీ బాబు' నాటికలోని సన్నివేశం



వర్క్ ఫ్రమ్ హోం నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

ప్రభుత్వ పాఠశాలల్లో 'స్ఫూర్తి'

- మానసిక దృఢత్వం, జీవన నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన
- ప్రతి శనివారం ఒక్కో మండలంలో కార్యక్రమం



స్ఫూర్తి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద (ఫైల్)



హాజరైన విద్యార్థులు

వరంగల్: రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో మానసిక దృఢత్వం, జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు కలెక్టర్ సత్యశారద ఆలోచన మేరకు 'స్ఫూర్తి' కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రతి శనివారం ఒక మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల 8న ఖానాపురం మండలంలోని 14 ప్రభుత్వ వసతిగృహాలు, 15న రాయపర్తి మండలంలోని 15 ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో 6 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 22న వరంగల్, ఖిలావరంగల్ మండలాల్లోని 45 ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చేపట్టారు. కాశిబుగ్గ నరేంద్రనగర్ (గుడిబడి) పాఠశాలలో కలెక్టర్ సత్యశారద పాల్గొని స్ఫూర్తి కార్యక్రమం కోసం రూపొందించిన షార్ట్ ఫిలింను విద్యార్థులతో కలిసి తిలకించారు.

10 అంశాలపై అవగాహన..

యునెస్కో, యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్యసంస్థ బాలబాలికల్లో జీవన నైపుణ్యాల అభివృద్ధి కోసం 10 అంశాలను రూపొందించింది. అందులో స్వీయ అవగాహన నైపుణ్యాలు (స్వీయ జాగృతి), సమానుభూతి (సహానుభూతి), సమస్య పరిష్కార నైపుణ్యం, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం, ప్రతిభాపూర్వక భావవ్యక్తీకరణ (భావప్రసార) నైపుణ్యం, విమర్శనాత్మక ఆలోచన నైపుణ్యం, సృజనాత్మక ఆలోచనా నైపుణ్యం, పరస్పర వ్యక్తిగత సంబంధాల నైపుణ్యం, ఒత్తిడి నియంత్రణా నైపుణ్యం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. కోపం, ఈర్ష్య, ద్వేషాలు, స్వార్థం, పగ తదితర విషయాలపై దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. జిల్లా అధికారులు, అపార అనుభవం కలిగిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై వివరిస్తున్నారు.

ప్రపంచాన్ని శాసించే స్థాయిలో..



వచ్చే 15 ఏళ్లలో ప్రపంచాన్ని శాసించే స్థాయిలో భారత యువత నిలుస్తుందని నా ఆశాభావం. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగించి నూతన ఆవిష్కరణలు చేయాలి. మొబైల్ ఫోన్లు, సాంకేతికతను (టెక్నాలజీ) అవసరం మేరకే వినియోగించుకోవాలి. అధికంగా వాడితే బానిసగా మారి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. విద్యార్థులు ఒత్తిడిని జయించి సామర్థ్యాలు పెంపొందించుకునేందుకు స్ఫూర్తి కార్యక్రమం దోహదపడుతుంది.

- సత్యశారద, కలెక్టర్

డీఈఓ ఆదేశాలు బేఖాతర్

- మండల విద్యాశాఖాధికారికి బాధ్యతల అప్పగింతలో జాప్యం
- ఉపాధ్యాయుడికి హెచ్‌పీఎల్ ప్రొసీడింగ్ జారీ చేసిన రిలీవైన ఎంఈఓ

నల్లబెల్లి: డీఈఓ ఆదేశాలను బేఖాతరు చేసినట్లు విద్యాశాఖలో జోరుగా చర్చ జరుగుతోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఈ నెల 12న నల్లబెల్లి ఎంఈఓ వసంతను రిలీవ్ చేస్తూ.. దుగ్గొండి ఎంఈఓ వెంకటేశ్వర్లుకు నల్లబెల్లి ఎంఈఓగా తాత్కాలికంగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఈఓ జ్ఞానేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వెంకటేశ్వర్లు నల్లబెల్లి ఎంఈఓగా విధుల్లో చేరారు. కానీ, ఆయనకు ఎంఈఓ బాధ్యతలు ఆమె అప్పగించలేదు. నేను తప్పు చేయలేదు అని ఎమ్మార్సీ కార్యాలయంలో కిందిస్థాయి ఉద్యోగులతో వాదిస్తోందని సమాచారం.

ఇదిలా ఉండగా రుద్రగూడెం ప్రాథమిక పాఠశాలలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకట్‌రాంనర్సయ్య వ్యక్తి గత కారణాలతో ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు విధులకు హాజరు కాలేదు. హెచ్‌పీఎల్ (హాఫ్‌పేలీవ్స్) ప్రొసీడింగ్ కోసం ఆయన దరఖాస్తు చేసుకున్నాడు. వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పగించకుండా రిలీవైన ఎంఈఓ హెచ్‌పీఎల్ ప్రొసీడింగ్ ఇచ్చారు. ఈ వ్యవహారంపై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తర్వులు లేకుండానే డిప్యూటేషన్లు..

- మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అక్రమ డిప్యుటేషన్లు కొనసాగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో పనిచేసిన ఎంఈఓ సత్యనారాయణ ఉపాధ్యాయ సంఘాల కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించి గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రాజుకు శనిగరం ప్రాథమిక పాఠశాలకు డిప్యుటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు లేకుండా ఆయన ముచ్చింపుల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు.
- గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు రజితకు గతంలో పనిచేసిన ఎంఈఓ బోల్లోనిపల్లి ప్రాథమిక పాఠశాలకు డిప్యుటేషన్ ఇచ్చారు. ఎలాంటి ఉత్తర్వులు లేకుండా రేలకుంట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు.
- మామిండ్లవీరయ్యపల్లిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రామును గతంలో పనిచేసిన ఎంఈఓ నారక్కపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించారు. కానీ, ఎలాంటి ఉత్తర్వులు లేకుండా నందిగామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొన్నాళ్లు పనిచేసి ప్రస్తుతం రంగాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు.
- కొండాయిల్‌పల్లిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రవి నందిగామ ప్రాథమిక పాఠశాలలో కొన్నాళ్లు పనిచేశారు. ప్రస్తుతం అర్వయ్యపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రత్యేక హాజరు పట్టికలో సంతకాలు

డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులు ప్రత్యేక హాజరు పట్టికలో సంతకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తమకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయని బుకాయిస్తుండడంతో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు చూసీచూనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎంఈఓకు వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పగించాలని, అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

హెచ్‌పీఎల్ ప్రొసీడింగ్ రద్దు చేశా..

రుద్రగూడెం ప్రాథమిక పాఠశాలలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న వెంకట్ రాంనర్సయ్యకు మంజూరు చేసిన హెచ్‌పీఎల్ ప్రొసీడింగ్‌ను రద్దు చేశాం. వర్క్ అడ్జెస్ట్ కింద ఉపాధ్యాయులకు డిప్యుటేషన్ ఇచ్చాం. అవి అక్రమ డిప్యుటేషన్లు కావు. డీఈఓ ఆదేశాల మేరకు తాత్కాలిక ఎంఈఓగా వచ్చిన వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పగిస్తా.

- వసంత, రిలీవైన ఎంఈఓ

రాజ్యలక్ష్మి బాధ్యత తీసుకుంటాం..

- డిస్ట్రిక్ట్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ రాచర్ల సురేశ్



రాజ్యలక్ష్మిని పరామర్శిస్తున్న రాచర్ల సురేశ్

దుగ్గొండి: కూతురు, కుమారుడు, భర్తను కోల్పోయి పక్షవాతంతో బాధపడుతున్న అభాగ్యురాలు కూచన రాజ్యలక్ష్మి జీవన బాధ్యతను జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ తీసుకుంటుందని జిల్లా చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ రాచర్ల సురేశ్ అన్నారు. మండలంలోని స్వామిరావుపల్లి గ్రామంలో ఆరేళ్ల క్రితం కూతురు, నాలుగు రోజుల క్రితం కుమారుడు మృతి చెందగా రెండు రోజుల క్రితం భర్త రవి బలవన్మరణానికి పాల్పడిన విషయం విదితమే. ఈమేరకు మంచానికి పరిమితమై అచేతన స్థితిలో ఉన్న రాజ్యలక్ష్మి దీనస్థితిపై పలు పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన జిల్లా న్యాయసాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి నిర్మలాగీతాంబ, న్యాయసాధికార సంస్థ కార్యదర్శి సాయికుమార్.. రాజ్యలక్ష్మి పరిస్థితిని పరిశీలించాలని జిల్లా చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ రాచర్ల సురేశ్‌ను ఆదేశించారు. దీంతో ఆయన ఆదివారం స్వామిరావుపల్లిలో రాజ్యలక్ష్మిని పరామర్శించారు. కుటుంబంలో జరిగిన మరణాలపై అడిగి తెలుసుకున్నారు. తాము అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాజ్యలక్ష్మిని అనాథ ఆశ్రమాలలో చేర్పించడంతో పాటు వైద్య ఖర్చులు, పోషణ అంతా జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ భరిస్తుందన్నారు. ఖర్మకాండలు ముగిసిన అనంతరం తాము తీసుకెళ్లి వైద్యం చేయించడంతోపాటు అన్నీ సౌకర్యాలు ఉన్న ఆశ్రమాలలో చేర్పిస్తామని వివరించారు. ఆయన వెంట నరహరి బుచ్చిరెడ్డి, తుమ్మలపెల్లి మహేందర్, చిరంజీవి, దాసరి రాజు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన గాండ్ల రాయమల్లు(70) ఆదివారం వడదెబ్బతో మృతి చెందాడు. రాయమల్లు మందమర్రిలో ఉంటున్న బంధువుల ఇంట్లో జరిగిన శుభాకార్యానికి హాజయ్యాడు. తిరిగి స్వగ్రామం వస్తున్న క్రమంలో ఓడేడ్ నుంచి గర్మిళ్లపల్లికి ఆటోలో వచ్చాడు. గర్మిళ్లపల్లి నుంచి రాఘవాపూర్‌కు కాలినడకన వస్తున్న క్రమంలో వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రెండు నెలల క్రితమే స్కెచ్..

రాజలింగమూర్తి హత్యకు ప్రణాళిక వేసుకున్న నిందితులు

- కళ్లలో కారం చల్లి, రాడ్‌తో కొట్టి, కత్తులతో పొడిచి హత్య
- వీడిన సామాజిక కార్యకర్త హత్య కేసు మిస్టరీ
- ఏడుగురు నిందితుల అరెస్ట్, పరారీలో మరో ముగ్గురు.. ఇందులో బీఆర్‌ఎస్ నాయకుడు కొత్త హరిబాబు కూడా..
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కిరణ్ ఖరే



రాజలింగమూర్తి(ఫైల్)



హత్యలో పాల్గొన్న, సహకరించిన నిందితులు

భూపాలపల్లి/భూపాలపల్లి అర్బన్: సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్యకు రెండు నెలల క్రితమే నిందితులు స్కెచ్ వేసుకుని మారణాయుధాలు కొనుగోలు చేశారు. అనువైన సమయం చూసి దారుణ హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఎస్పీ కిరణ్ ఖరే ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో రాజలింగమూర్తి హత్య కేసులో ఏడుగురు నిందితుల అరెస్ట్ చూపించి పూర్తి వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట గల సర్వే నంబర్ 319లోని ఎకరం భూమి విషయంలో మృతుడు నాగవెల్లి రాజలింగమూర్తికి, ప్రధాన నిందితుడు రేణుకుంట్ల సంజీవ్, అతడి బంధువుల మధ్య వివాదం నెలకొంది. ప్రస్తుతం అత్యంత విలువైన ఈ భూమి కేసుకు సంబంధించి త్వరలోనే తీర్పు రానుండగా తమకు ప్రతికూలంగా వచ్చే అవకాశం ఉందని భావించిన సంజీవ్.. తన బంధువులను కలిసి రాజలింగమూర్తిని హత్య చేసేందుకు రెండు నెలల క్రితం స్కెచ్ వేశాడు. ఈ మేరకు సంజీవ్, మోరె కుమార్ వరంగల్‌లోని కాశిబుగ్గకు వెళ్లి ఓ ఇనుప రాడ్, రెండు కత్తులు కొనుగోలు చేసి సంజీవ్ ఇంట్లో దాచి అనువైన సమయం కోసం వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 19న సంజీవ్ జిల్లా కోర్టుకు రాగా రాజలింగమూర్తి కనిపించాడు. దీంతో ఎలాగైనా ఈరోజే అతడిని చంపాలని కలిసి నిర్ణయించుకున్నారు.

ముగ్గురు పరారీలో..

రాజలింగమూర్తి హత్య కేసులో ప్రత్యక్షంగా నలుగురు పాల్గొనగా మరో ఏడుగురు సహకరించినట్లు తమ విచారణలో వెల్లడైందని ఎస్పీ ప్రకటించారు. కాగా, ఈ కేసులోని ఏడుగురు నిందితులు శనివారం సాయంత్రం భూపాలపల్లిలోని కేటీకే 5వ ఇంక్లైన్ వద్ద కలుసుకోగా, సమాచారం అందుకుని పట్టుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఏ-1 రేణుకుంట్ల సంజీవ్, ఏ-2 పింగిలి సేమంత్(బబ్లూ), ఏ-3 మోరె కుమార్, ఏ-4 కొత్తూరి కిరణ్, ఏ-5 రేణుకుంట్ల కొమురయ్య, ఏ-6 దాసారపు క్రిష్ణ, ఏ-7 రేణుకుంట్ల సాంబయ్యను అరెస్ట్ చేశామని, ఏ-8 కొత్త హరిబాబు, ఏ-9 పుల్ల నరేశ్, ఏ-10 పుల్ల సురేశ్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి, చిట్యాల సీఐలు డి. నరేశ్‌కుమార్, మల్లేశ్, ఎస్సైలు ఉన్నారు.

పక్కాగా ప్లాన్ చేసి..

ప్రధాన నిందితులు సంజీవ్, కొత్తూరి కిరణ్, మోరె కుమార్, పింగిలి సేమంత్(బబ్లూ) రెడ్డి కాలనీ మలుపు వద్ద రాజలింగమూర్తి తన ఇంటికి వెళ్లే సమయంలో హత్య చేసేందుకు కాపు కాసి ఉన్నారు. దాసరి క్రిష్ణ, నరేశ్ అతడి కదలికలను గమనిస్తూ రాత్రి సుమారు 6.45 గంటలకు రాజలింగమూర్తి ఇంటివైపు వస్తున్నాడని సమాచారం అందించారు. దీంతో వెంటనే అక్కడ కాపు కాసి ఉన్న వారు బైక్‌ను ఆపి రాజలింగమూర్తి కళ్లలో కారం చల్లి, రాడ్‌తో తలపై కొట్టి కత్తులతో కడుపులో పొడిచి చంపారు. చనిపోయాడని నిర్ధారించుకున్న తరువాత మూడు బైక్‌లపై నలుగురు నిందితులు పారిపోయారు.

పరారీలో హరిబాబు.. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా ?

రాజలింగమూర్తిని చంపిన అనంతరం ప్రధాన నిందితులు నలుగురు ఆటోలో పారిపోతూ భూపాలపల్లి మండలం శ్యాంనగర్ వద్ద కల్వల శ్రీనివాస్ అనే వ్యక్తి ఫోన్ అడిగి తీసుకుని భూపాలపల్లి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు కొత్త హరిబాబుకు ఫోన్ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో పోలీసులు అతడిని ఏ-8గా కేసులో చేర్చగా ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అంతేకాక అతడిపై ఇప్పటికే పది కేసులు ఉన్న నేపథ్యంలో త్వరలోనే భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ నమోదు చేస్తామని ఎస్పీ వెల్లడించారు. కాగా, హత్య కేసులో ఉన్న హరిబాబును బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేస్తారా.. లేక కొనసాగిస్తారా అనే చర్చ భూపాలపల్లిలో సాగుతోంది.

సీబీఐ విచారణ జరిపించాలి..

తన భర్త హత్యపై సీబీఐ విచారణ జరిపించాలని మృతుడి భార్య సరళ డిమాండ్ చేసింది. భూ వివాదం కారణంగా హత్య జరగలేదని, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కోర్టుకు వెళ్లడంతోనే తన భర్త దారుణ హత్యకు గురయ్యాడని ఆవేదన వ్యక్తం చేసింది. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నీ ముందుండి నడిపించాడని ఆరోపించింది. అప్పుడు బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌గా ఉన్న తనను ఏ తప్పు చేయకున్నా పార్టీ నుంచి సస్పెండ్ చేశారని, ఇప్పుడు హరిబాబు విషయంలో గండ్ర వెంకటరమణారెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించింది.

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

భూపాలపల్లి అర్బన్: నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసును హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు మానవ హక్కుల వేదిక నిజ నిర్ధారణ బృందం ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను కలిసి వివరాలు సేకరించింది. అనంతరం తిరుపతయ్య మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రధాన అనుచరుడు కొత్త హరిబాబు ప్రమేయం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించినట్లు తెలిపారు. దీనిపై మరింత విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపడితే మరిన్ని నిజాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రాణభయం ఉందని వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు బాదావత్ రాజు, హరికృష్ణ, దిలీప్, ప్రసాద్, సమ్మయ్య, శంకర్ పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి ఆగిన గుండె..

- చికిత్స పొందుతున్న చిన్నారి మృతి
- 19 రోజుల క్రితం కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలిపి తాగించిన తల్లి



కోలుకుని ఇంటికి చేరిన వరుణ్‌తేజ్



నిత్యశ్రీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

దోర్నకల్: తల్లి కర్కశత్వానికి ఓ చిన్నారి బలైంది. అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు కన్న తల్లే కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలిపి తాగించింది. హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల్లో ఒకరు కోలుకోగా మరొకరి పరిస్థితి విషమించడంతో శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డోర్నకల్ మండలం జోగ్యాతండాకు చెందిన వాంకుడోత్ వెంకటేశ్, ఉష దంపతులకు వరుణ్‌తేజ్(7), నిత్యశ్రీ(5) పిల్లలు ఉన్నారు. వెంకటేశ్ నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా ఉష పిల్లలతో కలిసి జోగ్యాతండాలోని అత్తగారి ఇంటి వద్ద ఉంటుంది. ఈ నెల 5న వరుణ్‌తేజ్, నిత్యశ్రీ ఇంటి వద్ద ఆడుకుంటూ కిందపడి వాంతులు చేసుకున్నారు. నానమ్మ బుజ్జి పిల్లలను పరిశీలించి ఆరా తీయగా తమకు తల్లి కూల్‌డ్రింక్ తాగించిందని తెలిపారు. కొద్దిసేపటి తరువాత తల్లి ఉష రావడంతో పిల్లలను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ రెండు రోజుల చికిత్స అనంతరం పిల్లల శరీరంలో గడ్డిమందు అవశేషాలు ఉన్నాయని వైద్యులు తెలపడంతో బంధువులు తల్లిని నిలదీశారు. దీంతో పిల్లలకు కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలిపి తాగించినట్లు ఒప్పుకుంది. పిల్లల ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై చిన్నారుల బాబాయి వాంకుడోత్ రాంబాబు ఈ నెల 10న డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. 15 రోజుల తర్వాత వరుణ్‌తేజ్ కోలుకోగా నిత్యశ్రీ పరిస్థితి విషమించి మృతి చెందింది. డోర్నకల్ సీఐ బి.రాజేశ్ హైదరాబాద్ వెళ్లి నిత్యశ్రీ మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, నిత్యశ్రీ మృతితో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

ఇంటికి చేరిన వరుణ్‌తేజ్..

చికిత్స పొంది కోలుకున్న వరుణ్‌తేజ్ శనివారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. తన చెల్లి మృతి చెందిందనే విషయం అర్థం కాక అమాయకంగా చూస్తున్న వరుణ్‌తేజ్‌ను చూసినవారు కంటతడి పెట్టారు.

'అకుట్' ఎన్నికలకు నోటిఫికేషన్

- నేటితో ముగియనున్న నామినేషన్ ప్రక్రియ
- మార్చి 4న ఓటింగ్..



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) ఎన్నికలకు యూనివర్సిటీ అధికారులు ఇటీవల నోటిఫికేషన్ జారీచేశారు. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. 2025-2027 సంవత్సరానికి గాను ఈ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈనెల 24న నామినేషన్ల ప్రక్రియ ముగియబోతుంది.అధ్యక్షుడు1, ఉపాధ్యక్షులు రెండు, జనరల్‌సెక్రటరీ 1, జాయింట్ సెక్రటరీ 1, కోశాధికారి 1, పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటారు. నామినేషన్ల ఉపసంహరణ ఈనెల 27న ఉంటుంది. అభ్యర్థుల తుదిజాబితా ప్రకటిస్తారు. ఈనెల 28న ఓటర్ల (అధ్యాపకులు) జాబితా వెల్లడిస్తారు. మార్చి 4న ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ ఉంటుంది. యూనివర్సిటీ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేయూలోని సెనేట్‌హాల్‌లో, కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. మార్చి 5న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు.

ఒకప్పుడు అకుట్ ఎన్నికలంటే పోటాపోటీ..

అకుట్ ఎన్నికలంటే ఆచార్యుల మధ్య అధ్యక్ష పదవికి, జనరల్ సెక్రటరీ ఇతర పదవులకు కూడా పోటీ నెలకొని రెండు ప్యానల్స్‌గా ఎన్నికల బరిలో ఉండేవారు. కొద్దిరోజులపాటు పోటాపోటీగా ప్రచారం నిర్వహించడంతో ఎన్నికల సందడి ఉండేది. అధ్యాపకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో అకుట్ ఎన్నికలంటే ప్రస్తుతం అంత ఆసక్తి ఉన్నట్లు కనబడడం లేదు. ప్రస్తుతం 77మంది (అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్లు) ఉన్నారు. జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, జియాలజీ విభాగం ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి అధ్యక్ష పదవికి నామినేషన్‌లు దాఖలు చేశారు. బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒకరు జనరల్ సెక్రటరీ పదవికి, మైక్రోబయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒకరు అధ్యక్ష పదవికి, జనరల్ సెక్రటరీ పదవికి రెండింటికి ఎన్నికల బరిలోఉండబోతున్నారని యూనివర్సిటీలో చర్చగా ఉంది. ఆయా వివిధ పదవులకు ఎంతమంది పోటీచేస్తారనేది ఈనెల 24న నామినేషన్ చివరి రోజు వెల్లడికానుంది.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



రాజేశ్వర్‌రావు(ఫైల్)



ముత్తయ్య (ఫైల్)

దుగ్గొండి: ఒంటరితనం భరించలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన మండలంలోని గోపాలపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాగులగాణి రాజేశ్వర్‌రావు(45) భార్య సుమిత్ర 15 సంవత్సరాల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఒంటరితనంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 22వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈఘటనపై మృతుడి సోదరి కుడుతాల హంస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

అనారోగ్య సమస్యలతో రాజీవ్‌నగర్‌లో వృద్ధుడు..

దేవరుప్పుల: అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు.. ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని రంబోజీగూడెం గ్రామ పంచాయతీలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మేడ ముత్తయ్య (75) కొంతకాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల షుగర్ స్థాయి పెరిగడంతో వైద్యులు ఓ కాలు ఆపరేషన్ చేసి తీసివేశారు. దీంతో మనస్తాపానికి గురైన ముత్తయ్య శనివారం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎల్లంలో వ్యక్తి..

జనగామ రూరల్: జనగామ మండలం ఎల్లంల గ్రామానికి చెందిన జంజాల స్వామి(38) ఆదివారం బాణాపురం రూట్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ కథనం ప్రకారం.. పది సంవత్సరాలుగా మతిస్థిమితం లేక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న స్వామి.. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

27 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

- అన్నాచెల్లి అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన పర్వతగిరి సీఐ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజగోపాల్

పర్వతగిరి: పర్వతగిరి మండలం చింతనెక్కొండ క్రాస్ వద్ద శనివారం రాత్రి 27 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని అన్నాచెల్లిని అరెస్ట్ చేసినట్లు పర్వతగిరి సీఐ బి.రాజగోపాల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పర్వతగిరి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఢిల్లీకి చెందిన అన్నాచెల్లి సంజీల షేక్, రోహిత్‌షేక్ ఆంధ్రప్రదేశ్, ఒడిశా బార్డర్‌లో ఎండు గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం రైలులో బయలుదేరారు. మార్గమధ్యలో రైలులో పోలీసులు తనిఖీలు చేస్తుండగా భయపడి మహబూబాబాద్‌లో దిగారు. అనంతరం వరంగల్ వెళ్లడానికి బస్సులో బయలుదేరి మార్గమధ్యలో చింతనెక్కొండ క్రాస్ వద్ద దిగారు. ఈ సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై బి.ప్రవీణ్, సిబ్బందికి వీరిపై అనుమానం కలిగింది. బ్యాగులు తనిఖీ చేయగా 27 కిలోల ఎండు గంజాయి లభించింది. దీంతో స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు.

ధర్మసాగర్ పీఎస్ పరిధిలో 15.61 కేజీలు..



గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

ధర్మసాగర్: ధర్మసాగర్ పీఎస్ పరిధి కాజీపేట మండలం రాంపూర్ శివారులోని ఇండస్ట్రీయల్ ప్రాంతంలో ఓ వ్యక్తి ఎండు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడినట్లు ఎస్సై జానీ పాషా తెలిపారు. ఇండస్ట్రీయల్ ప్రాంతంలో ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వారిని చూసి ఓ వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు అతడిని పట్టుకుని తనిఖీ చేయగా సుమారు రూ. 7.80 లక్షల విలువైన 15.61 కేజీల ఎండు గంజాయి లభించింది. దీంతో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అంకిత్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అంకిత్ విశాఖపట్నంలో గంజాయి కొనుగోలు చేసి రైలులో ఫిరోజాబాద్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో రైలు దిగి కొంత మేర సరుకు రాంపూర్ ఇండస్ట్రీయల్ ప్రాంతంలో అమ్మడానికి వచ్చి పట్టుబడినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'వయ్యారి భామ' కలవరం..

పంటల్లో వేగంగా విస్తరిస్తున్న కలుపు మొక్క

- టమాట, వంకాయ, మిరప మొక్కలకు తీవ్ర నష్టం
- ఆందోళనలో అన్నదాతలు
- రైతులు నివారణ చర్యలు పాటించాలి: మల్యాల కేవీకే శాస్త్రవేత్త క్రాంతికుమార్



ఉయ్యాలవాడలో మిరపతోటలో ఏపుగా పెరిగిన వయ్యారి భామ మొక్కలు



తోటలో వయ్యారి భామ మొక్కను చూపుతున్న రైతు మంగీలాల్

దోర్నకల్: పంటలకు కీడు చేసే వయ్యారి భామ కలుపు మొక్క వ్యవసాయ భూముల్లో విస్తరిస్తూ కలవరపెడుతోంది. ఫలితంగా ఈ మొక్కలను నివారించలేక.. పంటలకు నష్టం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ మొక్క శరవేగంగా వ్యాపించి అంతేవేగంతో పెరుగుతూ పంట పొలాలను నిర్వీర్యం చేస్తుంది. దీంతో పంట దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. ఈ నేపథ్యంలో ఈ మొక్కల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై మల్యాల కేవీకే శాస్త్రవేత్త క్రాంతికుమార్ రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పంటలకు తీవ్ర నష్టం..

పత్తి, మిరప, మొక్కజొన్న, పూల తోటల్లో వయ్యారి భామ మొక్క తీవ్రంగా వ్యాప్తి చెందుతుంది. పంటలకు వేసిన ఎరువుల శాతాన్ని ఎక్కువ శాతం పీల్చుకుని బలపడుతుంది. పంటల నత్రజని, పోషక విలువలు, సూక్ష్మధాతువుల శాతాన్ని తగ్గిస్తుంది. వయ్యారి భామ మొక్క స్రవించే రసాయనాలతో పంట పెరుగుదల తగ్గడం, వీటి పుష్పాల నుంచి వచ్చే పుప్పొడి రేణువులు టమాట, వంకాయ, మిరప మొక్కలపై పడి వాటి పుష్పాలు, పిందెలు రాలిపోతాయి. వీటి ద్వారా అనేక రకాల వైరస్‌లు, తెగుళ్ల వ్యాప్తి చెందుతాయి. ఈ మొక్కల్లో ఉండే తామర పురుగులు గాలి ద్వారా వ్యాప్తి చెందుతాయి. మొక్క విత్తనాలు గాలి ద్వారా మూడు కిలోమీటర్ల వరకు విస్తరించి అక్కడి వరకు మొలకెత్తుతాయి.

నివారణ చర్యలు..

పొంట పొలాల్లో మొలచిన వయ్యారి భామ మొక్కలను పూత రాకముందే వేర్లతో సహా పీకి బురదలో తొక్కేయాలి. తర్వాత నీరు పెడితే బాగా మురిగి పచ్చిరొట్టగా మారుతుంది. లేదా మొక్కలను దూరంగా తీసుకెళ్లి తగలబెట్టాలి. ఈ మొక్కకు పూత రాకముందు 10 లీటర్ల నీటికి 5 కిలోల ఉప్పును కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. తంగేడు చెట్లు ఉన్న ప్రాంతంలో ఈ మొక్క మొలవదు.

ఆహార దిగుబడుల సమయంలో దేశంలోకి ఈ మొక్క ప్రవేశం..

అమెరికా నుంచి ఆహార దిగుబడులు చేసుకునే క్రమంలో భారతదేశంలోకి ప్రవేశించిన పార్థీనియం పేరుతో పిలిచే వయ్యారి భామ మొక్కను మొదట బిహార్, మహారాష్ట్రలో కనుగొన్నారు. కలుపు మొక్క పంటపొలాలు, బీడు భూములు, రోడ్ల పక్కన విస్తరిస్తుంది. కాగా, వయ్యారి భామ మొక్కకు కాంగ్రెస్ గడ్డి, ముక్కుపుల్లాకు గడ్డి, క్యారెట్ గడ్డి, నక్షత్ర గడ్డి, పార్థీనియం అనే పేర్లు ఉన్నాయి.

మనుషులకూ ప్రమాదమే..

వయ్యారి భామ మొక్కలతో మనుషులకూ ముప్పు ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటీస్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. వీటి తామర పుప్పొడిని పీలిస్తే జలుబు, కళ్లు ఎర్రబడడం, దురద, తుమ్ములు రావడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. పశువులు వయ్యారి భామ మొక్కలను తింటే వెంట్రుకలు రాలిపోవడం, హైపర్ టెన్షన్ సమస్యలు తలెత్తే అవకాశాలు ఉండగా, ఈ పశువుల పాలు తాగే వారికి జ్ఞాపకశక్తి తగ్గడం, జీర్ణక్రియ, కిడ్నీ, లివర్, అన్నవాహిక, శ్వాసక్రియలు దెబ్బతింటాయి.

దిగుబడి తగ్గుతోంది..

వయ్యారి భామ మొక్కలతో మా మిరప తోటలో దిగుబడి గణనీయంగా తగ్గింది. తోటకు వేసే ఎరువులను వయ్యారి భామ మొక్క పీలుస్తుండడంతో మిరప మొక్కల కంటే ఈ మొక్కే ఏపుగా పెరుగుతోంది.

-బానోత్ మంగీలాల్, రైతు, కస్నాతండా

అప్రమత్తంగా ఉండాలి..



వయ్యారి భామ మొక్కలతో పంటలు, పశువులతో పాటు మనుషులకూ ముప్పు ఉంది. ఈనేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి. మొక్కను మొదట్లోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. వీటిపై నిర్లక్ష్యంగా ఉంటే అన్ని విధాలా నష్టం జరుగుతుంది.

-క్రాంతికుమార్, కేవీకే శాస్త్రవేత్త, మల్యాల

గోనెసంచిలో కుక్కి.. బావిలో పడేసి

- బంగారం కోసం వృద్ధురాలిని చంపిన దుండగులు
- బోయినిపల్లిలో ఘటన



వీరమ్మ(ఫైల్)

టేకుమట్ల: బంగారం కోసం ఓ వృద్ధురాలిని దుండగులు దారుణంగా చంపారు. ఆభరణాలు తీసుకున్న అనంతరం వృద్ధురాలి చేతులు కట్టేసి.. గోనె సంచిలో కుక్కి.. వ్యవసాయ బావిలో పడేసి పరారయ్యారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి శివారు బోయినిపల్లిలో వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం..బోయినిపల్లికి చెందిన సోరుపాక వీరమ్మ(70) పని నిమిత్తం ఈ నెల 19న సాయంత్రం(బుధవారం) గర్మిళ్లపల్లికి వెళ్తున్నానని తన భర్తకు చెప్పి కాలినడకన వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో ఆదివారం గర్మిళ్లపల్లి-బోయినిపల్లి రోడ్డు పక్కన ఓ వ్యవసాయ బావి నుంచి దుర్వాసన వస్తుందని గ్రామస్తులు గ్రహించి బావిలోకి చూడగా వీరమ్మ మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా వారు హుటాహుటినా ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. బుధవారం గర్మిళ్లపల్లికి వెళ్తున్న వీరమ్మపై దుండగులు దాడి చేసి బంగారు గొలుసు, కాళ్ల కడియాలు తీసుకున్నారు. అనంతరం చేతులు కట్టేసి, గోనె సంచిలో కుక్కి బావిలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. బంగారం, వెండి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని తెలిపారు. వీరమ్మ హత్య మండల వ్యాప్తంగా చర్చానీయాంశమైంది.

రైలు ఢీకొని పాలేరు దుర్మరణం

- కోమళ్ల రైల్వేగేట్ వద్ద ఘటన

రఘునాథపల్లి: కుమారుడి ఆరోగ్యం బాగలేదని వచ్చిన సమాచారంతో కంగారుగా ఫోన్ మాట్లాడుతూ పట్టాలు దాటుతున్న క్రమంలో రైలు ఢీకొని ఓ పాలేరు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కోమళ్ల రైల్వేగేట్ వద్ద జరిగింది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ కథనం ప్రకారం.. లింగాలఘణపురం మండలం చీటూరు గ్రామానికి చెందిన ఎర్ర ఎల్లేశ్ (35) మండలంలోని కోమళ్లలో కన్నారపు యాదగిరి వద్ద పాలేరుగా పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఎల్లేశ్‌కు ఇంటి వద్ద నుంచి కుమారుడి ఆరోగ్యం బాగలేదని ఫోన్ రావడంతో కోమళ్ల నుంచి బయలు దేరాడు. రైల్వే గేట్ వద్ద జనగామ వైపు వెళ్తున్న రైలు వెళ్లాక ఎల్లేశ్ కంగారుగా ఫోన్ మాట్లాడుతూ మరో వైపు నుంచి వచ్చే రైలును గుర్తించలేదు. దీంతో గేట్ దాటుతున్న క్రమంలో రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.